

చీనీ టన్ను రూ.26,690

అనంతపురం వ్యవసాయ మార్కెట్‌యార్డులో మంగళవారం టన్ను చీనీకాయలు గరిష్టంగా రూ.26,690, కనిష్టంగా రూ.10 వేల ప్రకారం ధర పలికాయి.



కిలో టమాట రూ.49

అనంతపురం శివారు కక్కలపల్లి మండీలో మంగళవారం కిలో టమాట గరిష్టంగా రూ.49, కనిష్టంగా రూ.33, సరాసరిన రూ.42 ప్రకారం ధర పలికింది.

గరిష్టం/కనిష్టం

28.1°/ 19.3°

జిల్లాలో మంగళవారం తుపాను వాతావరణం నెలకొంది. ఆకాశం పూర్తిగా మేఘావృతమై అక్కడక్కడా తుంపర్లు పడ్డాయి. గంటకు 6 నుంచి 8 కి.మీ వేగంతో వాయువ్య దిశగా గాలి వీచింది.

న్యూస్‌రీల్

జిల్లా వ్యాప్తంగా వర్షం

- 32 మండలాల్లో 13.3 మి.మీ సగటు వర్షపాతం నమోదు



కళకళలాడుతున్న వేరుశనగ

పుట్టపర్తి అర్బన్: ఫెంగల్ తుపాను ప్రభావంతో మూడో రోజు మంగళవారం జిల్లాలోని 32 మండలాల్లో వర్షం కురిసినట్లు వాతావరణ శాఖ అధికారులు తెలిపారు. అత్యధికంగా రామగిరి మండలంలో 33.4 మి.మీ, ధర్మవరం మండలంలో 31.4 మి.మీ వర్షపాతం నమోదైనట్లు వెల్లడించారు.ఇక గోరంట్ల 22.4, తలుపుల 19.6, నల్లచెరువు 17.4, కదిరి 17.2, ముదిగుబ్బ 16.8, ఓడీచెరువు 16.8, తాడిమర్రి 16.6, బత్తలపల్లి 16.4, ఎన్‌పీకుంట 15, సీకేపల్లి 14.6, గాండ్లపెంట 14.2, సోమందేపల్లి 13.8, నల్లమాడ 13.4, కనగానపల్లి 12.6, రొళ్ల 12.2, బుక్కపట్నం 12, కొత్తచెరువు 11.6, అమడగూరు 11.2, పెనుకొండ 11, మడకశిర 9.6, గుడిబండ 9.6, తనకల్లు 9.4, పరిగి 9, లేపాక్షి 8, హిందూపురం 6.4, అమరాపురం 6, అగళి 5.6, రొద్దం 5.2, చిలమత్తూరు 4.2, పుట్టపర్తి మండలంలో 3.6 మి.మీ వర్షపాతం నమోదైనట్లు తెలిపారు. దీంతో జిల్లాలోని 32 మండలాల పరిధిలో 13.3 మి.మీ సగటు వర్షపాతం నమోదైనట్లు అధికారులు పేర్కొన్నారు. తుపాను ప్రభావం జిల్లాపై బుధవారం కూడా ఉంటుందన్నారు. తుపాను ప్రభావంతో రబీలో సాగు చేసిన వేరుశనగ, మొక్కజొన్న, కూరగాయల పంటలు కళకళలాడుతున్నాయి.

విశ్రాంత ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి



రాష్ట్ర డైరెక్టర్ ఆఫ్ ట్రెజరీస్ అండ్ అకౌంట్స్ అధికారిని సన్మానిస్తున్న పెన్షనర్లు

ధర్మవరం రూరల్: విశ్రాంత ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి తనవంతు కృషి చేస్తానని రాష్ట్ర డైరెక్టర్ ఆఫ్ ట్రెజరీస్ అండ్ అకౌంట్స్ అధికారి మోహన్‌రావు తెలిపారు. మంగళవారం ఆయన పట్టణంలోని ఏటీఓ కార్యాలయాన్ని తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కార్యాలయంలోని రికార్డులను పరిశీలించారు. అనంతరం రిటైర్డ్ ఎంప్లాయీస్ అసోసియేషన్ భవనాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా వారి సమస్యలను తెలుసుకొని వాటి పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా పెన్షనర్ల సంఘం అధ్యక్షుడు చలపతి, ట్రెజరీ పద్మనాభం ఆధ్వర్యంలో సభ్యులు మోహన్‌రావు ఘనంగా సన్మానించారు.

'సైబర్' ప్రచారం విస్తృతం చేయండి

- ప్రజలు ఉచ్చులో చిక్కుకోకుండా అవగాహన కల్పించండి
- సిబ్బందికి ఎస్పీ రత్న ఆదేశం



వీసీలో మాట్లాడుతున్న ఎస్పీ రత్న

పుట్టపర్తి టౌన్: ఇటీవల జిల్లాలోనూ సైబర్ నేరాలు పెరుగుతున్నాయని, ప్రజలు సైబర్ నేరస్తుల ఉచ్చుకు చిక్కకుండా అవగాహన కల్పించాలని ఎస్పీ రత్న పోలీస్ అధికారులను ఆదేశించారు. మంగళవారం ఆమె జిల్లా పోలీసు కార్యాలయం నుంచి డీఎస్పీలు, సీఐలు, ఎస్‌ఐ లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ రత్న... ఇప్పటివరకూ జిల్లాలో నమోదైన సైబర్ కేసులు.. దర్యాప్తు, పరిష్కరించిన కేసులపై ఆరా తీశారు. పెండింగ్‌లో ఉన్న కేసుల దర్యాప్తుపై దృష్టి సారించాలన్నారు. ఇటీవల అనంతరం ఆమె మాట్లాడుతూ, ఇటీవల కాలంలో చాలా మంది సైబర్ నేరస్తుల ఉచ్చులో చిక్కుకుని రూ.లక్షలు నష్టపోతున్నారన్నారు. ముఖ్యంగా కొరియర్, లోన్‌యాప్, హనీట్రాప్, లాటరీలు, డెబిట్ కార్డులు, న్యూడ్ వీడియో కాల్స్‌తో మోసాలకు పాల్పడుతున్నారని, ఇలాంటి వారి బారిన పడకుండా జాగ్రత్త పడేవిధంగా ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. ఇందుకోసం జిల్లా వ్యాప్తంగా ప్రచారం విస్తృతం చేయాలని సూచించారు. అలాగే ప్రధాన పట్టణాల్లో పోస్టర్లు అతికించాలన్నారు. ఒకవేళ ఎవరైనా 'సైబర్' ఉచ్చులో పడితే సంఘటన జరిగిన వెంటనే 1930 నంబర్‌కు డయల్ చేసి సమాచారం ఇవ్వాలని, లేదా www.cybercrime.gov.in వెబ్‌సైట్ ద్వారా ఫిర్యాదు చేస్తే తక్షణ సాయం అందుతుందన్న విషయం అందరికీ వివరించాలన్నారు. వీడియో కాన్ఫరెన్స్‌లో సైబర్ క్రైమ్ సీఐ తిమ్మారెడ్డి, డీసీఆర్‌బీ సిఐ శ్రీనివాసులు పాల్గొన్నారు.



తిమ్మమ్మమర్రిమాను బాహ్య చిత్రం

నిర్లక్ష్యం ఊడలు.. మర్రికి చెదలు!

తిమ్మమ్మమర్రిమాను... 669 సంవత్సరాల చరిత్ర. 8.15 ఎకరాల్లో విస్తరించి... 1350కిపైగా ఊడలతో వ్యాపించింది. ప్రపంచంలోనే అతిపెద్ద మర్రిమానుగా ఏకంగా గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డులో చోటు దక్కించుకుంది. కానీ అభివృద్ధికి మాత్రం ఆమడదూరంలో నిలిచింది. దేశ విదేశాల నుంచి పర్యాటకులు వస్తున్నా.. కనీస సౌకర్యాల కల్పనలో అధికారులు విఫలం కావడంతో తిమ్మమ్మ మర్రిమాను ఖ్యాతికి చెదలు పడుతోంది



మర్రిమాను వద్ద ఉన్న తిమ్మమాంబ ఆలయం



కోతకు గురై భూసారం తగ్గడంతో ఆకులు రాలిన దృశ్యం

- తిమ్మమ్మమర్రిమానుకు ప్రపంచ ప్రఖ్యాతి
- దేశ విదేశాల నుంచి తరలివస్తున్న పర్యాటకులు
- కనీస సౌకర్యాలు లేక సతమతం
- తాగే నీరూ దొరకని వైనం
- రవాణా సౌకర్యం లేక నగం మంది వెనక్కి
- అభివృద్ధి చేసి ఆదరణ కల్పించాలని కోరుతున్న స్థానికులు

ఎన్‌పీకుంట: జిల్లాలోని నంబులపూలకుంట (ఎన్‌పీకుంట) మండలం గూటిబైలు గ్రామంలోని తిమ్మమ్మమర్రిమాను చరిత్ర అమోఘం. అభివృద్ధి మాత్రం దారుణం. అంతర్జాతీయ ఖ్యాతి గాంచిన ఈ అతిపెద్ద మర్రిమాను గురించి ఎవరూ పట్టించుకోలేదు. ఫలితంగా సౌకర్యాలు కరువయ్యాయి.

మర్రిమాను చరిత్ర..

దిగువగూటిబైలు గ్రామానికి చెందిన తిమ్మమాంబ భర్త బాలవీరయ్యతో కలిసి 1355లో సతీసహగమనం చేసినట్లు ఇక్కడి చరిత్ర చెబుతోంది. ఆ సమయంలో చితికి నాలుగు వైపులా నాటిన ఎండు మర్రిగుంజల్లో ఈశాన్యం వైపు నాటిన గుంజ చిగురించి, నేడు మహావృక్షంగా మారి చరిత్ర పుటల్లోకి ఎక్కింది. 8.15 ఎకరాల్లో విస్తరించి ఉన్న తిమ్మమ్మమర్రిమాను కర్ణాటక రాష్ట్రానికి చెందిన జర్నలిస్ట్ సత్యనారాయణ అయ్యర్ కృషి ఫలితంగా 1989లో గిన్నిస్‌బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్‌లో చోటు దక్కించుకుంది.

అభివృద్ధి పనులు డిమాండ్ ఇలా..

- తిమ్మమాంబ అమ్మవారి దర్శనం అనంతరం పర్యాటకులు మర్రిమాను పరిసర ప్రాంతంలో సేద తీరడం కోసం పార్కు ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉంది.
- పర్యాటకులను ఆకర్షించేందుకు మరిన్ని వన్య ప్రాణులను తీసుకురావడం, ఆటస్థలాన్ని అభివృద్ధి చేయాలి.
- పర్యాటకుల కోసం విశ్రాంతి భవనం, నీటి, మరుగుదొడ్ల వసతి కల్పించాలి. రోజూ అన్నదాన కార్యక్రమం నిర్వహించాలి. మర్రిమాను పరిసర ప్రాంతాల్లో వివిధ రకాల పూలమొక్కలు పెంచి అందంగా తీర్చిదిద్దాలి.
- మర్రిచెట్టు ఉన్న విస్తీర్ణంలో మీటరు ఎత్తున కొత్త మట్టిని తోలించి, వాలిన ఊడలను సంరక్షించాలి.
- తిమ్మమ్మమర్రిమానుకు పడమర వైపున ఓబుళదేవరగుట్టపై 10 ఏళ్ల క్రితం టీటీడీ వారు వెంకటేశ్వస్వామి ఆలయం నిర్మించారు. కానీ ఇంత వరకు విగ్రహప్రతిష్ఠ చేయలేదు. దీంతో ఆ ఆలయ ప్రదేశం అసాంఘిక కార్యక్రమాలకు నిలయంగా మారింది. వెంటనే విగ్రహ ప్రతిష్ఠ చేసి ఆలయంలో పూజలు ప్రారంభిస్తే ఈప్రాంతానికి భక్తుల రాక పెరుగుతుంది.

సౌకర్యాలు కరువు..

తిమ్మమ్మమర్రిమాను గురించి తెలుసుకుని పొరుగు రాష్ట్రాల నుంచే కాకుండా విదేశాల నుంచి కూడా ఎంతో ఆసక్తితో పర్యాటకులు వస్తుంటారు. ఇక్కడి దాకా వచ్చిన వారికి కనీస సౌకర్యాలు కూడా లేకపోవడంతో అమ్మవారిని దర్శించుకుని తిరుగుముఖం పడుతున్నారు. కనీసం తాగునీరు, మరుగుదొడ్ల సౌకర్యం కూడా లేకపోవడంతో వెంటనే వెళ్లిపోతున్నారు. మరోవైపు పర్యవేక్షణ కరువై ఊడలు కూడా చెదలు పడుతున్నాయి.

అటవీశాఖ ఆధీనంలోకి తీసుకున్నా..

1990వ సంవత్సరంలో తిమ్మమ్మమర్రిమాను అటవీ అభివృద్ధి శాఖ ఆధీనంలోకి తీసుకుంది. పార్కు, షెడ్లు ఏర్పాటు చేసి కొన్ని వన్యప్రాణులను తీసుకువచ్చి అందులో ఉంచింది. సమీపంలోని 27 ఎకరాలు కూడా సేకరించింది. కానీ ఆ తర్వాత నిర్వహణ గురించి పట్టించుకోలేదు. ఫలితంగా అభివృద్ధి కుంటుపడింది. పార్కులో పిచ్చిమొక్కలు ఏపుగా పెరిగాయి. వన్యప్రాణుల షెడ్డులో జింకలు, కుందేళ్లు, నెమళ్లు మాత్రమే ఉన్నాయి.

భూమి కోత.. ఊడలకు చెదలు..

గతంలో దట్టమైన ఆకులతో మర్రిమాను కళకళలాడుతూ ఉండేది. పర్యాటకులు కూడా మర్రిమాను కింద సేదతీరేవారు. అటవీశాఖ ఆధీనంలోకి తీసుకున్నాక చుట్టూ కంచె ఏర్పాటు చేశారు. ఆ తర్వాత ఎప్పుడో ఉన్నతాధికారులు వచ్చినప్పుడు మాత్రం శుభ్రత చర్యలు చేపడుతున్నారు. దీంతో ప్రస్తుతం మర్రిమాను లోపలిభాగంలో కొన్ని చోట్ల భూమి కోతకు గురైంది. భూసారం తగ్గి ఆకులు రాలిపోవడంతో పాటు, చెట్టు సైతం నేల వాలింది. మరికొన్ని చోట్ల ఊడలకు చెదలు పట్టింది. వెంటనే ప్రభుత్వాలు తిమ్మమ్మమర్రిమాను సంరక్షణకు చర్యలు తీసుకోవాలని పర్యాటకులు కోరుతున్నారు.

వసతులు కల్పించాలి



మేము ఏటా మర్రిమానును సందర్శిస్తాము. గతంలో బాగుండేది. ప్రస్తుతం సౌకర్యాలు లేవు. అమ్మవారిని దర్శించి వెళ్లాల్సి వస్తోంది. మధ్యాహ్న సమయంలో భోజన వసతి కూడా ఉండదు. పిల్లలు ఆడుకోవడానికి పార్కు, ఆటస్థలం అభివృద్ధి చేయాలి. నీటి, భోజన వసతి కల్పిస్తే బాగుంటుంది. అలాగే మర్రి ఊడలు చెదలు పట్టకుండా కాపాడాలి.

– సి.నాగార్జునరెడ్డి, యాత్రికుడు, అనంతపురం

సౌకర్యాలు కరువు



తిమ్మమ్మమర్రిమాను దర్శనానికి వస్తే ఇక్కడ కనీస సౌకర్యాలు లేవు. అమ్మవారి దర్శనం తరువాత సేద తీరడానికి అవకాశమే లేదు. మరుగుదొడ్లు, విశ్రాంతి భవనాలు లేవు. ఆటస్థలంలో క్రీడాపరికరాలు ఏవీ లేవు. అలాగే మర్రిమాను కింద సేదదీరే ఏర్పాట్లు లేకపోవడంతో దూరం నుంచే చూసి వెళ్లాల్సి వస్తోంది. ప్రభుత్వాలు చర్యలు తీసుకొని ఈ ప్రాంతాన్ని అభివృద్ధి చేస్తే పర్యాటకుల సంఖ్య మరింత పెరుగుతుంది.

– రవికుమార్, యాత్రికుడు, అనంతపురం



తిమ్మమాంబ ఆలయంలో అమ్మవారు



నిర్వహణ లోపంతో నిరుపయోగంగా ఉన్న ఆటస్థలం



మర్రిమాను లోపలి భాగంలో కూలిన మర్రి ఊడ

తేమ అధికం.. ధర పతనం

- తగ్గిన ఎండుమిర్చి ధర
- వారంలోనే క్వింటాపై రూ.4 వేలు తగ్గుదల



మార్కెట్‌కు వచ్చిన ఎండుమిర్చి

హిందూపురం అర్బన్: ఫెంగల్ తుపాను ఎండుమిర్చి రైతుల ఆశలపై నీళ్లు చల్లింది. కుటుంబంతో కలిసి రెక్కలుముక్కలు చేసుకుని పంటను కాపాడుకున్న రైతులు దిగుబడి చూసి మురిసిపోయారు. మార్కెట్‌లో ధరలు కూడా కాస్త అటుఇటుగా ఉండగా నష్టాల నుంచి బయటపడతామని భావించారు. కానీ తుపాను తీవ్రంగా దెబ్బతీసింది.

ముసురుతో ధరల పతనం..

తుపాను ప్రభావంతో జిల్లా వ్యాప్తంగా మబ్బులు కమ్ముకొని తేలిక పాటి వర్షాలు కురుస్తున్నాయి. ఎంతగా పంటను కాపాడుకోవాలనుకున్నా.. వాతావరణంలో తేమశాతం ఎక్కువైంది. దీంతో ఎండుమిర్చి మెత్తగా మారిపోయింది. తప్పసరి పరిస్థితుల్లో మార్కెట్‌కు తీసుకురాగా, నాణ్యత పేరుతో వ్యాపారులు ధరలో కోత పెడుతున్నారు. దీంతో ఎండుమిర్చి రైతులు ఆందోళన చెందుతున్నారు.

క్వింటా రూ.14 వేలు..

మంగళవారం హిందూపురం వ్యవసాయ మార్కెట్‌కు 93 క్వింటాళ్ల ఎండుమిర్చి రాగా, అధికారులు ఈ–నామ్ పద్ధతిలో వేలం వేశారు. ఇందులో మొదటి రకం ఎండుమిర్చి క్వింటా రూ.14 వేలు, రెండో రకం క్వింటా రూ.9 వేలు, మూడోరకం ఎండుమిర్చి క్వింటా రూ. 8 వేల చొప్పున ధర పలికాయి. గత వారం మొదటి రకం మిర్చి క్వింటా రూ.18 వేలు పలకగా, వారం రోజుల్లోనే క్వింటాపై రూ.4 వేలు పడిపోయింది. ధర రోజురోజుకూ తగ్గిపోతుండటంతో రైతులు ఆందోళన చెందుతున్నారు.

నష్టపరిహారం నివేదికలు సిద్ధం చేయండి

- క్షేత్రస్థాయిలో విచారణ చేసి 10వ తేదీలోపు సమర్పించాలి
- అధికారులకు కలెక్టర్ టీఎస్ చేతన్ ఆదేశం



అధికారులతో సమీక్షిస్తున్న కలెక్టర్ టీఎస్ చేతన్

ప్రశాంతి నిలయం: జిల్లాలో వివిధ జాతీయ రహదారులు విస్తరణలో భాగంగా పలు పాఠశాలలకు నష్టం జరిగిందని, వాటికి పరిహారం చెల్లించేందుకు డిసెంబర్ 10లోపు నివేదికలు సిద్ధం చేయాలని కలెక్టర్ టీఎస్ చేతన్ ఆదేశించారు. మంగళవారం ఆయన కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాలులో జాతీయ రహదారుల విస్తరణ పనులు, పరిహారం చెల్లింపు అంశంపై సంబంధిత అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో జాతీయ రహదారుల విస్తరణ పనులు జరుగుతున్నాయని, ఇందులో భాగంగా కొన్ని పాఠశాలల అదనపు గదులు, వంట గదులు, ప్రహరీలు, మరుగుదొడ్లు, బోర్లు తొలగించాల్సి వచ్చిందన్నారు. ఆయా మండలాల ఎంఈఓలు, పాఠశాలల ప్రధానోపాధ్యాయుల సమక్షంలో ఎంతమేర నష్టం జరిగిందో అంచనా వేసి నివేదికలు సిద్ధం చేయాలని జాతీయ రహదారుల అధికారులను ఆదేశించారు. అలాగే ఆర్‌డబ్ల్యూఎస్ అధికారుల ఇంజినీర్ల ఆధ్వర్యంలో వివిధ పాఠశాలల్లోని బోర్లు తనిఖీ చేసి పాఠశాలల విద్యార్థులకు నీరు అందేలా చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లాలో జరుగుతున్న ఎన్‌హెచ్ –342, బెంగళూరు ఎక్స్‌ప్రెస్ హైవే పనులు, ఎన్‌హెచ్–761జి రహదారులకు సంబంధించిన నివేదికలు సిద్ధం చేయాలన్నారు. సమీక్షలో ఎంఈఓలు గోపాల్ నాయక్, పద్మప్రియ, రెడ్డయ్య, సమగ్ర శిక్ష అభియాన్ ఇంజినీర్లు, ఏపీ ట్రాన్స్‌కో అధికారులు, విద్యుత్ శాఖ అధికారులు పాల్గొన్నారు.

సర్టిఫికెట్ల కోసం సమరం!

- జనన ధ్రువీకరణ పత్రాల జారీలో తీవ్ర జాప్యం
- అధికారుల తీరును నిరసిస్తూ రోడ్డుపై బైఠాయించిన జనం
- గంటపాటు నిరసనతో రాకపోకలకు అంతరాయం



రహదారిపై బైఠాయించి నిరసన తెలుపుతున్న విద్యార్థుల తల్లిదండ్రులు

బత్తలపల్లి: జనన ధ్రువీకరణ సర్టిఫికెట్ల కోసం విద్యార్థుల తల్లిదండ్రులు సమరం చేయాల్సిన పరిస్థితి ఏర్పడింది. కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన ఆటోమేటెడ్ పర్మినెంట్ అకడమిక్ అకౌంట్ రిజిస్ట్రీ (అపార్) కార్డు కోసం విద్యార్థులు తల్లిదండ్రులు పడరానిపాట్లు పడుతున్నారు. ఆధార్‌లో చిన్నచిన్న మార్పులకోసం జనన ధ్రువీకరణ పత్రం అవసరం కావడంతో రోజుల తరబడి రెవెన్యూ కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నారు. సాంకేతిక సమస్య, కొందరు ఉద్యోగులు నిర్లక్ష్యంతో కార్యాలయాల వద్దే పడిగాపులు కాయాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఈ నేపథ్యంలో విద్యార్థుల తల్లిదండ్రులు విధిలేని పరిస్థితిలో రోడ్డెక్కి నిరసన బాట పట్టారు. మంగళవారం బత్తలపల్లిలోని గ్రామ సచివాలయ సమీపాన బత్తలపల్లి–తాడిపత్రి ప్రధాన రహదారిపై దాదాపు గంట పాటు సచివాలయ ఇబ్బంది, అధికారుల నిర్లక్ష్యవైఖరిని నిరసిస్తూ ధర్నా నిర్వహించారు. దీంతో రాకపోకలు పూర్తిగా స్తంభించాయి.

ఆర్డీటీ ఆస్పత్రిలోనే ఎక్కువ ప్రసవాలు..

బత్తలపల్లిలోని ఆర్డీటీ ఆస్పత్రిలో ప్రసవాల కోసం ఉమ్మడి అనంతపురం జిల్లా నుంచే కాకుండా వివిధ ప్రాంతాల నుంచి వస్తుంటారు. దీంతో ఇక్కడ ప్రసవమైన వారందరికీ జనన ధ్రువీకరణ పత్రం స్థానిక పంచాయతీ అధికారులే ఇవ్వాల్సి ఉంటుంది. ఏవైనా మార్పులు చేయాలన్నా మళ్లీ ఇక్కడికే రావాల్సిన పరిస్థితి. ఈ క్రమంలో ఇటీవల కేంద్రం 'అపార్' కార్డు కోసం వివరాలు సేకరిస్తోంది. ఇందుకు బర్త్ సర్టిఫికెట్‌ను ప్రామాణికంగా తీసుకుంటుండడంతో వాటిని పొందడానికి విద్యార్థుల తల్లిదండ్రులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రోజూ కార్యాలయానికి జనం పోటెత్తుతున్నా...అధికారులు తగు చర్యలు తీసుకోవడం లేదు. దీంతో విసిగిపోయిన విద్యార్థుల తల్లిదండ్రులు మంగళవారం రహదారిపై బైఠాయించి నిరసన తెలిపారు. 20 రోజుల నుంచి కార్యాలయాలు చుట్టూ తిరుగుతున్నామని వివిధ పట్టణాలకు చెందిన వారు ఆవేదన వ్యక్తం చేశారు. కార్యాలయంలోని ఓ ఉద్యోగి డబ్బు వసూలు చేస్తున్నారని ఆరోపించారు. విషయం తెలుసుకున్న బత్తలపల్లి ఏఎస్‌ఐ సోమశేఖర్, పంచాయతీ కార్యదర్శి నారాయణస్వామి తదితరులు విద్యార్థుల తల్లిదండ్రులతో చర్చించారు. అదనపు సిబ్బందిని నియమించి సకాలంలో జనన సర్టిఫికెట్‌లు అందజేస్తామని హామీ ఇచ్చారు. దీంతో విద్యార్థుల తల్లిదండ్రులు ఆందోళన విరమించారు.



జనన సర్టిఫికెట్ల కోసం సచివాలయం వద్ద పడిగాపులు కాస్తున్న తల్లిదండ్రులు

లేపాక్షి ఆలయంలో స్కానర్లు

- ఫోన్‌పే, గూగుల్ పే ద్వారా హుండీ కానుకలు సమర్పించే అవకాశం



ఆలయంలో హుండీని ఏర్పాటు చేసిన దృశ్యం



ఆలయంలో చీరలు, పంచెలు లెక్కిస్తున్న సిబ్బంది

లేపాక్షి: ప్రపంచ ప్రఖ్యాతిగాంచిన లేపాక్షి వీరభద్రస్వామి దేవాలయానికి వచ్చే భక్తులు కానుకలు సమర్పించేందుకు వీలుగా మంగళవారం ఆలయంలో స్కానర్లు అమర్చారు. నగదు రహిత లావాదేవీలకు అలవాటు పడిన భక్తులు.. హుండీ ద్వారా స్వామివారికి కానుకలు సమర్పించే సమయంలో ఇబ్బందులు పడుతున్నారని ఆలయ కమిటీ చైర్మన్ కరణం రమానందన్ తెలిపారు. దీన్ని గుర్తించి స్కానర్ల ద్వారా భక్తులు కానుకలు స్వామివారికి సమర్పించేలా ఏర్పాట్లు చేశారు. దీంతో హుండీల ద్వారా స్వామివారికి వచ్చే ఆదాయం పెరిగే అవకాశం ఉందన్నారు. అంతేకాకుండా ఆలయానికి వచ్చిన భక్తులు అమ్మవారికి 484 చీరలు, వీరభద్రస్వాముల వారికి 197 పంచెలు సమర్పించుకున్నారని, వాటిని వేలం వేయడమా, లేక పేదలకు ఇవ్వడమా అనే విషయాలు త్వరలో వెల్లడిస్తామన్నారు. కార్యక్రమంలో ఆలయ ఈఓ నరసింహమూర్తి, దేవాదాయ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

క్లుప్తంగా

వ్యక్తి బలవన్మరణం


జయన్న (ఫైల్)

అగళి: అప్పులు తీర్చే మార్గం కానరాక ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు తెలిపిన మేరకు.. అగళి మండలం ఆర్.జి.పల్లికి చెందిన నాయీ బ్రాహ్మణుడు జయన్న (56) క్షురక వృత్తితో జీవనం సాగిస్తున్నాడు. ఈ క్రమంలో వృత్తిలో నిలదొక్కుకునేందుకు, కుటుంబ అవసరాలకు ప్రైవేట్ వడ్డీ వ్యాపారుల వద్ద అప్పు చేశాడు. అప్పులకు వడ్డీల భారం పెరిగి రూ.4 లక్షలకు చేరుకుంది. ఈ క్రమంలో నమ్ముకున్న వృత్తిలో ఆదాయం లేకపోవడం, చేసిన అప్పులు తీర్చేందుకు కుటుంబసభ్యుల సహకారం లేకపోవడంతో మనస్తాపం చెందిన ఆయన మంగళవారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో పంచతో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఆయనకు ఓ కుమారుడు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. కుమారుడి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

ఇరువర్గాల ఘర్షణ.. పలువురికి గాయాలు

నల్లమాడ: మండలంలోని దొన్నికోటలో మంగళవారం ఇరువర్గాల మధ్య ఘర్షణ చోటు చేసుకొని పలువురు గాయపడ్డారు. గ్రామస్తుల సమాచారం మేరకు.. పొలాలకు వెళ్లే రస్తా విషయంలో ఇరువర్గాలు పరస్పరం దాడికి దిగాయి. ఓ వర్గానికి చెందిన వారాది, ఆయన భార్య లక్ష్మీదేవి, మరో వర్గానికి చెందిన రాజు, మరికొందరు గాయపడ్డారు. వారాది, లక్ష్మీదేవి కదిరి ప్రభుత్వాస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. మరో వర్గానికి చెందిన క్షతగాత్రులు నల్లమాడలోని కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌లో చేరారు. ఘటనపై తమకు ఫిర్యాదు అందితే తగిన చర్యలు తీసుకుంటామని పోలీసులు పేర్కొన్నారు.

వైద్యం.. దైవాధీనం!

రోజూ ఓపీ
2 వేల నుంచి 2,500

ఐపీ
1,100 నుంచి 1,300

సొమ్మసిల్లిన గర్భిణి



నాలుగు నెలల గర్భంతో ఉన్న వెంకటాపురం గ్రామానికి చెందిన హసీనా... వైద్య పరీక్షల నిమిత్తం ఆశా కార్యకర్త ఫక్రుబీతో కలసి మంగళవారం సర్వజనాస్పత్రికి వచ్చింది. గంటకుపైగా క్యూలో నిల్చొన్న ఆమె ఉన్నఫలంగా సొమ్మసిల్లిపడిపోయింది. దీంతో ఆశా వర్కర్ ఫక్రుబీ వెంటనే ఆమెకు ఉపశమన చర్యలు చేపట్టడంతో కాస్త కోలుకుంది. ఇలాంటి దృశ్యాలు సర్వజనాస్పత్రిలో రోజూ చోటు చేసుకుంటూనే ఉన్నాయి. ఆస్పత్రి అధికారుల బాధ్యతారాహిత్యానికి రోగులు నరకయాతన అనుభవిస్తున్నారు.


అభా కార్డు రిజిస్ట్రేషన్ చేయిస్తున్న దృశ్యం


ఓపీ కోసం వెళ్లిన తల్లి ఎంతసేపటికి తిరిగి రాకపోవడంతో గుక్కపట్టి ఏడుస్తున్న పసికందు

- జీజీహెచ్‌లో ఓపీ చీటీ తీసుకునేందుకు రెండు గంటల సమయం
- అభా కార్డు నమోదుతో గంటల తరబడి నిరీక్షణ
- ఈ ప్రక్రియ పూర్తయ్యేలోపు పత్తా లేకుండా పోతున్న వైద్యులు
- సొమ్మసిల్లి పడిపోతున్న ఓపీ రోగులు

అనంతపురం మెడికల్: ఉమ్మడి జిల్లాకు పెద్ద దిక్కుగా ఉన్న అనంతపురంలోని ప్రభుత్వ సర్వజనాస్పత్రి (జీజీహెచ్)లో వైద్యం దైవాదీనంగా మారింది. వైద్యుల వద్దకు వెళ్లేకంటే ముందే ఓపీ చీటీ తీసుకోవడంలోనే రోగులు నరకయాతన అనుభవిస్తున్నారు. గంటల తరబడి క్యూలో నిలబడలేక సొమ్మసిల్లి పడిపోతున్నారు. ఇక సుదూర ప్రాంతాల నుంచి వచ్చే పేదల ఇబ్బందులు మాటల్లో చెప్పలేనివి.

ఓపీ చీటీ తీసుకునేలోపు పత్తాలేని వైద్యులు

ఉమ్మడి జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి రోజూ 2 వేల మంది వరకు రోగులు చికిత్స కోసం సర్వజనాస్పత్రికి వస్తున్నారు. ఉదయం 9 నుంచి 12 గంటల వరకు ఓపీ చీటీలు ఇస్తారు. ఈ సమయంలోనే వారు వైద్య సేవలు అందుకోవాల్సి ఉంటుంది. ఒక వేళ ఓపీ చీటీ జారీలో ఆలస్యం చోటు చేసుకుంటే ఆ రోజుకు చికిత్స అందని ద్రాక్షగానే మారుతోంది. జీజీహెచ్‌లోని ఏ విభాగంలోనూ వైద్యులు నిర్ణీత వేళలను పాటించకపోవడమే ఇందుకు కారణం. ఆస్పత్రి ఆవరణలోని నాలుగు ఓపీ కౌంటర్లలో గంటల తరబడి బారులుతీరి చీటీ తీసుకున్న అనంతరం షెడ్డు ఆరు బయట ఉన్న స్టాఫ్‌నర్సులతో అబా కార్డు రిజిస్ట్రేషన్ చేయించుకోవాలి. ఈ మొత్తం ప్రక్రియ పూర్తి అయ్యేందుకు దాదాపు రెండు గంటల సమయం పడుతోంది. ఇక అక్కడి నుంచి వార్డుకి వెళ్లే లోపు వైద్యులుంటే సరి.. లేకపోతే ఆ రోజుకు రూ.వందలు ఖర్చు చేసుకుని నిరాశగా వెనుదిరగాల్సి వస్తోంది.

పేరుకే 'అభా'

ఆయుష్మాన్ భారత్ హెల్త్ అకౌంట్ (అభా) పేరుతో ఆస్పత్రిలో స్టాఫ్‌నర్సులు చేస్తున్న రోగుల రిజిస్ట్రేషన్ ప్రక్రియ మొత్తం ఓ ప్రహసనంగానే మారింది. వాస్తవానికి అభా నమోదు ప్రక్రియ అనేది వైద్య సేవలను సులభతరం చేయడమే కాక, రోగికి సత్వర నాణ్యమైన సేవలు అందించేందుకు దోహదపడుతోంది. ఒక్కసారి అభాలో రిజిస్ట్రేషన్ చేయించుకుంటే ఆ రోగి పేరుపై ఓ ఐడీ జనరేట్ అవుతుంది. ఆ తర్వాత రోగి ఎప్పుడు ఆస్పత్రికి వెళ్లినా సంబంధిత ఓపీ విభాగంలో ఆ ఐడీ నంబర్‌ను కంప్యూటర్‌లో వైద్యుడు ఎంటర్ చేయగానే రోగికి సంబంధించిన పాత రికార్డులన్నీ కనిపిస్తాయి. దీని ఆధారంగా గతంలో ఏ తరహా చికిత్స అందజేశారు. దాని ఫలితాలు ఏమిటి? ప్రస్తుతం ఎలాంటి చికిత్స అందజేయాలో డాక్టర్ నిర్ధారించుకునేందుకు వీలవుతుంది. ఇదెలా ఉన్నా.. జీజీహెచ్‌లోని మెడిసిన్, గైనిక్, పీడియాట్రిక్స్, సర్జరీ, ఆర్థో, పల్మనాలజీ, డర్మటాలజీ,, ఈఎన్‌టీ, తదితర విభాగాల్లో అబా ఐడీ పరిశీలించి చికిత్స అందించే సౌలభ్యం లేదు.

ఈ అవస్థలు పడలేం



నా భర్త నరసింహులు, నేను ఇద్దరమూ చికిత్స కోసం వచ్చాం. క్యూలో నిలబడి ఓపీ చీటీ తీసుకునేందుకు అరగంటకు పైగా పట్టింది. నా భర్త ఇంకా క్యూ లైన్‌లోనే ఉన్నాడు. ఆయన ఎప్పుడు వస్తాడో తెలియదు. ఈ లోపు ఏదో కార్డు రిజిస్ట్రేషన్ చేయించుకోమంటున్నారు. నాకేమో చదువురాదు, సెల్‌ఫోన్ లేదు. ఇవన్నీ తీసుకుని డాక్టర్ దగ్గరికి ఎప్పుడు పోవాలో కూడా తెలియడం లేదు. ఏంది సార్ మాలాంటి ముసోళ్లకు ఈ కష్టం. ఈ అవస్థలు పడలేం. ముందే బాగున్నాది. చికిత్స కోసం వస్తే త్వరగా చూసి పంపేవారు.

– రామాంజినమ్మ, మారుతీనగర్, అనంతపురం

కాలు విరిగింది... గంట నుంచి వేచి ఉన్నా



నా బిడ్డ సింధూ స్కూల్‌కు వెళ్తూ కింద పడింది. దీంతో కాలులో ఎముక విరిగినట్లుగా కన్పిస్తోంది. దీంతో చికిత్స కోసం సర్వజనాస్పత్రికి వచ్చాం. నేను పాప వద్ద ఉన్నా. నా భార్య లలిత క్యూలో నిల్చోంది. గంటకుపైగా అవుతోంది. నొప్పితో బిడ్డ బాధపడుతోంది. ఓపీ చీటీ తీసుకుని మేము పోయే సరికి డాక్టర్ లేకపోతే పాప పరిస్థితి ఏమిటి? పెద్ద సార్లు కాస్త ఓపిక చేసుకుని త్వరగా ఓపీ సేవలందించేలా చూడాలి.

– మారుతి, కడదరకుంట గ్రామం, కూడేరు మండలం

ఆర్టీసీ కార్మికుల సమస్యల పరిష్కారానికి ఉద్యమం

- ఎన్‌ఎంయూ జోనల్ కార్యదర్శి చెన్నారెడ్డి


ప్రసంగిస్తున్న చెన్నారెడ్డి

మడకశిర: ఆర్టీసీ కార్మికుల సమస్యల పరిష్కారానికి ఉద్యమిస్తామని ప్రభుత్వాన్ని ఎన్‌ఎంయూ జోనల్ కార్యదర్శి చెన్నారెడ్డి హెచ్చరించారు. స్థానిక మార్కెట్ యార్డు ఆవరణలో మంగళవారం నిర్వహించిన ఎన్‌ఎంయూ జోనల్ కోశాధికారి అధ్యక్షతన జరిగిన సర్వసభ్య సమావేశంలో ఆయన ప్రసంగించారు. కార్మికుల ఉద్యోగ భద్రత కోసం కృషి చేస్తున్నామన్నారు. పలు సమస్యల పరిష్కారానికి ఈడీతో చర్చిస్తామన్నారు. మడకశిర డిపోలో నెలకొన్న సమస్యలను వెంటనే పరిష్కరించకపోతే ఉద్యమిస్తామని హెచ్చరించారు. సమావేశంలో రీజనల్ కార్యదర్శి షబ్బీర్, ఎంసీ సభ్యుడు గోపాల్, హిందూపురం డిపో అధ్యక్ష, కార్యదర్శులు కిరణ్‌కుమార్, రంగనాథ్, రీజనల్ నాయకులు కరియప్ప, రామచంద్ర, స్థానిక ఎన్‌ఎంయూ అధ్యక్షుడు రామకృష్ణ, నాయకులు నాయక్, లక్ష్మీకాంత్, జయసింహ, ముద్దప్ప, పురుషోత్తం తదితరులు పాల్గొన్నారు.

చిట్టచివరన ఉన్న చెరువుకు తొలుత పీఏబీఆర్ నీరు

- హెచ్చెల్సీ ఎస్‌ఈ రాజశేఖర్


పీఏబీఆర్ నుంచి కుడికాలువకు విడుదల చేసిన నీరు

కూడేరు: మండలంలోని పెన్నహోబిలం బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ (పీఏబీఆర్) నుంచి తొలుత ధర్మవరం కుడికాలువ చిట్టచివరన ఉన్న తాడిమర్రి మండలం అగ్రహారంలోని చెరువును నింపుతామని హెచ్చెల్సీ ఎస్‌ఈ రాజశేఖర్ మంగళవారం తెలిపారు. ఉరవకొండ, శింగనమల, రాప్తాడు, ధర్మవరం నియోజకవర్గాల్లో తాగునీటి అవసరాల కోసం సోమవారం పీఏబీఆర్ నుంచి కుడి కాలువకు నీటిని విడుదల చేసినట్లు తెలిపారు. ప్రస్తుతం 250 క్యూసెక్కుల నీటిని కుడి కాలువకు వదిలామన్నారు. చిట్టచివరన ఉన్న చెరువు అనంతరం ప్రాధాన్యత క్రమంలో చెరువులను నింపుతూ వస్తామన్నారు.

డ్రైవర్‌కు ఆరు నెలల జైలు శిక్ష

సోమందేపల్లి: రోడ్డు ప్రమాదానికి కారణమైన డ్రైవర్‌కు ఆరు నెలల జైలు శిక్ష విధిస్తూ పెనుకొండ ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ బొజ్జప్ప మంగళవారం తీర్పు వెలువరించారు. ఎస్‌ఐ రమేష్ బాబు తెలిపిన మేరకు... 2016లో సోమందేపల్లి మండలం కొనతట్టుపల్లిలో బోర్‌వెల్ లారీ డ్రైవర్ నాగరాజు నిర్లక్ష్యంగా వాహనాన్ని నడపడంతో నాగభూషణం అనే వ్యక్తి మృతి చెందాడు. మృతుడి భార్య అంజలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, పక్కా ఆధారాలతో నాగరాజుపై పోలీసులు చార్జ్‌షీట్ దాఖలు చేసిన న్యాయస్థానంలో సమర్పించారు. ఈ కేసు వాదనలు పూర్తయి నేరం రుజువు కావడంతో డ్రైవర్ నాగరాజుకు ఆరు నెలల జైలు శిక్షతో పాటు రూ.10 వేల జరిమానా విధిస్తూ న్యాయమూర్తి తీర్పు వెలురించారు. కేసులో ప్రాసిక్యూషన్ తరఫున వాదనలను ఏపీపీ శ్యామల వినిపించారు.

జెడ్పీ సీఈఓ విధుల్లో చేరికపై వీడని సందిగ్ధత

అనంతపురం సిటీ: ఉమ్మడి జిల్లా పరిషత్ సీఈఓ రామచంద్రారెడ్డి విధుల్లో చేరికపై సందిగ్ధత నెలకొంది. మూడు నెలల క్రితం నంద్యాల జిల్లా డ్వామా పీడీ ఆర్.రామచంద్రారెడ్డిని ఉమ్మడి అనంతపురం జిల్లా పరిషత్ సీఈఓగా నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. అయితే అంతకు ముందే ఆయన అమెరికా వెళ్లాలనే ఉద్దేశంతో ప్రభుత్వం నుంచి అనుమతి తీసుకున్నారు. సెప్టెంబర్ 23వ తేదీ నుంచి డిసెంబర్ 1 వరకు ఆయన సెలవు పెట్టారు. దీంతో డిప్యూటీ సీఈఓగా నియమితులైన వెంకటసుబ్బయ్యకు సీఈఓ ఎఫ్ఏసీ బాధ్యతలు అప్పగిస్తూ.. కలెక్టర్ డాక్టర్ వి.వినోద్‌కుమార్ ఉత్తర్వులు జారీ చేశారు. అంతకు ముందే ఏడాదిన్నరగా పేరుకు పోయిన అనేక రకాల బిల్లులు, ఫైళ్లను క్లియర్ చేయడం, క్యాంపులు, కలెక్టరేట్‌లో సమీక్షలు, కాన్ఫరెన్స్‌లు, ఇతర పని ఒత్తిళ్ల కారణంగా ఆయన తీవ్ర అనారోగ్యానికి గురై వారం రోజుల పాటు విశ్రాంతి తీసుకున్న తర్వాత విధులకు హాజరవుతున్నారు. ఈ క్రమంలో రామచంద్రారెడ్డి చేరికపై సర్వత్రా ఆసక్తి నెలకొంది. వాస్తవానికి రామచంద్రారెడ్డి సెలవు ఈ నెల ఒకటిన ముగిసింది. సోమవారం విధులకు హాజరు కావాల్సి ఉంది. అయినా ఆయన విధుల్లో చేరలేదు. కొందరు ఫోన్లు చేస్తున్నా ఆయన స్పందించడం లేదని తెలిసింది.

గుర్తు తెలియని వ్యక్తి మృతి



పుట్టపర్తి టౌన్: స్థానిక ప్రశాంతి నిలయం రైల్వే స్టేషన్ వద్ద వాహనాల పార్కింగ్ ప్రదేశంలో సోమవారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తి మృతదేహాన్ని స్థానికులు గుర్తించారు. సమాచారం అందుకున్న పోలీసులు అక్కడకు చేరుకుని పరిశీలించారు. సోమవారం రాత్రి రైల్వేస్టేషన్ పార్కింగ్ ఆవరణలో నిద్రించిన వ్యక్తి మంగళవారం ఉదయానికి విగతజీవిగా మారినట్లు ప్రాథమిక విచారణలో నిర్ధారించారు. మృతుడి వద్ద వ్యక్తిగత సమాచారం తెలిపే ఎలాంటి ఆధారాలు లేవు. ఘటనపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినట్లు పోలీసులు తెలిపారు.

విద్యుదాఘాతంతో యువకుడి దుర్మరణం


వెంకటేష్ (ఫైల్)

పామిడి: విద్యుత్ షాక్‌కు గురై ఓ యువకుడు మృతి చెందాడు. పోలీసులు తెలిపిన మేరకు... పామిడిలోని బ్రాహ్మణవీధిలో నివాసముంటున్న బోయ మిద్దే ఆంజనేయులు, లక్ష్మీదేవి దంపతులకు ఓ కుమార్తె, కుమారుడు వెంకటేష్ (26) ఉన్నారు. కుమార్తెకు వివాహమైంది. కుమారుడు ఆటో డ్రైవర్‌గా జీవనం సాగిస్తున్నాడు. ఈ క్రమంలో సోమవారం రాత్రి తన స్నేహితులు నరేష్, గోపితో కలసి సంతమార్కెట్‌లోని టెంకాయల మస్తాన్ కొట్టం వెనుక ఉన్న షెడ్‌లో మద్యం సేవించాడు. వర్షం మొదలు కావడంతో అర్ధరాత్రి వరకూ అక్కడే ఉండాల్సి వచ్చింది. అనంతరం షెడ్డు బయటకు వస్తూ రాడ్‌ను తాకగానే విద్యుత్ షాక్‌కు గురై కుప్పకూలాడు. గమనించిన నరేష్, గోపి వెంటనే స్థానిక ప్రభుత్వాస్పత్రికి తీసుకెళ్లారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే వెంకటేష్ మృతి చెందినట్లు నిర్ధారించారు. కాగా, విషయం తెలుసుకున్న డీసీసీబీ మాజీ చైర్మన్ ఎం. వీరాంజనేయులు మంగళవారం ఉదయం ఆస్పత్రికి చేరుకుని మార్చురీలో ఉన్న వెంకటేష్ మృతదేహాన్ని పరిశీలించారు. ఘటనపై ఆరా తీసి, బాధిత కుటుంబసభ్యులను ఓదార్చారు.

కుటుంబంలో ప్రేమ చిచ్చు

- మనస్తాపంతో తల్లి ఆత్మహత్య..
- కుమార్తె ఆత్మహత్యాయత్నం


శ్రీలక్ష్మి (ఫైల్)

తాడిపత్రి రూరల్: కుమార్తె వేరే కులానికి చెందిన వ్యక్తిని ప్రేమించడంతో మనస్తాపం చెంది తల్లి ఆత్మహత్య చేసుకుంది. ఈ అంశంలో కుమార్తెను బంధువులు తప్పుబట్టడంతో ఆమె కూడా ఆత్మహత్యాయత్నం చేసింది. పోలీసులు తెలిపిన మేరకు.. తాడిపత్రిలోని నవరంగ్ టాకీస్ రోడ్డులో కిరాణా కొట్టు నిర్వహిస్తున్న శ్రీనివాసులు, శ్రీలక్ష్మి దంపతుల కుమార్తె శ్రీజ... వేరే కులానికి చెందిన వ్యక్తిని ప్రేమించింది. ఈ విషయం తెలుసుకున్న తల్లిదండ్రులు మందలించారు. క్షణికావేశానికి లోనైన కుమార్తె వెంటనే పోలీసులను ఆశ్రయించింది. దీంతో పోలీసులు సోమవారం సాయంత్రం స్థానిక ఐశ్వర్య విల్లాలో ఉన్న ఇంటికి చేరుకుని తల్లిదండ్రులకు కౌన్సిలింగ్ ఇచ్చారు. దీంతో మనస్తాపానికి గురైన శ్రీలక్ష్మి పురుగుల మందు తాగింది. గమనించిన కుటుంబసభ్యులు వెంటనే స్థానిక ప్రభుత్వాస్పత్రికి తీసుకెళ్లారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే ఆమె మృతిచెందినట్లు నిర్ధారించారు. విషయం తెలుసుకున్న బంధువులు శ్రీజను దోషిగా చూస్తూ మందలించారు. దీంతో మనస్తాపానికి గురైన శ్రీజ ఇంట్లోని ఫ్యాన్‌కు ఉరి వేసుకుంది. వెంటనే కుటుంబసభ్యులు ఆమెను కాపాడి అనంతపురంలోని ఆస్పత్రిలో చేర్పించారు. సమాచారం అందుకున్న అప్‌గ్రేడ్ సీఐ శివగంగాధర్ రెడ్డి క్షేత్రస్థాయిలో విచారణ చేపట్టి, ఘటనపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు. కాగా, విషయం తెలుసుకున్న మునిసిపల్ చైర్మన్ జేసీ ప్రభాకర్‌రెడ్డి ప్రభుత్వ ఆస్పత్రికి చేరుకుని బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు.

విషజ్వరంతో అంగన్‌వాడీ టీచర్ మృతి


మృతురాలు సుశీలమ్మ

బొమ్మనహాళ్: విషజ్వరంతో బాధపడుతూ బొమ్మనహాళ్ మండలం శ్రీధరఘట్ట గ్రామానికి చెందిన అంగన్‌వాడీ టీచర్ సుశీలమ్మ (55) మృతి చెందింది. బంధువులు తెలిపిన మేరకు.. 15 రోజుల క్రితం తీవ్ర జ్వరంతో బాధపడుతున్న సుశీలమ్మ స్థానిక ప్రభుత్వాస్పత్రిలో చికిత్స పొందింది. అనంతరం అదే రోజు ఇంటికి చేరుకున్న ఆమె సొమ్మసిల్లి పడిపోవడంతో కుటుంబసభ్యులు వెంటనే బళ్లారిలోని బిమ్స్‌కు తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో వైద్యుల సూచన మేరకు బెంగళూరుకు తీసుకెళ్లారు. 15 రోజులుగా కోమా నుంచి ఆమె బయట పడకపోవడంతో చివరకు కర్నూలులోని ఆస్పత్రిలో చేర్పించారు. చికిత్సకు స్పందించక ఆమె మంగళవారం మృతి చెందింది.

అంతర్రాష్ట్ర దొంగల ముఠా అరెస్ట్

ఇద్దరు భార్యలు.. ఏడుగురు పిల్లలను పోషించలేక ఓ పెయింటర్ దొంగగా మారాడు. పోలీసులకు పట్టుబడి జైలు శిక్ష అనుభవించే సమయంలో పాత నేరస్తులతో పరిచయం పెంచుకుని ఓ ముఠాను ఏర్పాటు చేసుకున్నాడు. పట్టుమని మూడు పదుల వయసులోనే ముఠా నాయకుడిగా చలామణి అవుతూ ఆంధ్ర, కర్ణాటక, తెలంగాణ రాష్ట్రాల్లో విచ్చలవిడిగా దొంగతనాలు సాగిస్తూ వచ్చాడు. చివరకు అనంత పోలీసులకు పట్టుబడి ఊచలు లెక్కిస్తున్నాడు.

- రూ.22 లక్షల విలువ చేసే 310 గ్రాముల బంగారం, కారు స్వాధీనం


వివరాలు వెల్లడిస్తున్న అనంతపురం జిల్లా ఎస్పీ జగదీష్

అనంతపురం: ఆంధ్ర, కర్ణాటక, తెలంగాణ రాష్ట్రాల్లో పలు చోరీ కేసుల్లో నిందితులుగా ఉన్న దొంగల ముఠా సభ్యులను అనంతపురం జిల్లా పోలీసులు అరెస్ట్ చేశారు. వీరి నుంచి రూ.22 లక్షల విలువైన 310 గ్రాముల బంగారం, ఓ కారు స్వాధీనం చేసుకున్నారు. జిల్లా పోలీసు కార్యాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో నిందితుల వివరాలను ఎస్పీ పి.జగదీష్ వెల్లడించారు.

ఒక్కడే... 41 కేసుల్లో నిందితుడు..

శ్రీసత్యసాయి జిల్లా ధర్మవరం పట్టణానికి చెందిన షేక్ ఖాజాపీరా అలియాస్ ఖాజాకు ఇద్దరు భార్యలు, ఏడుగురు పిల్లలు ఉన్నారు. పెయింటింగ్ పనులతో జీవనం సాగించేవాడు. అయితే పెయింటింగ్ పనులతో వచ్చే సంపాదన ఆయన ఖర్చులకు, కుటుంబ పోషణకు సరిపోయేది కాదు. దీంతో దొంగతనాలను ప్రవృత్తిగా మార్చుకుని అనంతపురం ఉమ్మడి జిల్లాతో పాటు ఆంధ్రప్రదేశ్‌లో 14, కర్ణాటకలోని బాగేపల్లిలో 4, కోలార్ జిల్లాలో 5, తెలంగాణాలోని షంషాబాద్‌లో 4 దొంగతనాలు సాగిస్తూ మొత్తం 27 కేసుల్లో పోలీసులకు పట్టుబడి రిమాండ్ ఖైదీగా జైలుకు వెళ్లాడు. ఆ సమయంలో చోరీ కేసుల్లో శిక్ష అనుభవిస్తున్న ధర్మవరం పట్టణానికి చెందిన మహేష్, జమీర్‌తో పరిచయడం ఏర్పడింది. ఏడాది తర్వాత ముగ్గురూ బయటకు వచ్చారు. అనంతరం ముగ్గురూ ముఠాగా ఏర్పడి చోరీలకు తెరలేపారు. అనంతపురం రూరల్, త్రీ టౌన్, ఫోర్త్ టౌన్, యాడికి, ఇటుకలపల్లి పోలీస్ స్టేషన్ల పరిధిలో 10, కర్ణాటకలోని కోలార్‌లో 4 దొంగతనాలు మొత్తం 14 చోరీ కేసుల్లో వీరు ప్రధాన నిందితులు. గతంలో జరిగిన చోరీ కేసులతో కలుపుకుంటే ఖాజా ఒక్కడిపైనే మొత్తం 41 కేసులు ఉన్నాయి.

డ్రైవింగ్ ఒకరు.. చోరీలు చేసేది మరొకరు..

చోరీలు చేయడంలోనూ ఆరితేరిన ముగ్గురూ ఓ పథకం ప్రకారం ముందుకు సాగారు. తొలుత తాళం వేసిన ఇళ్లను ఎంపిక చేసుకుని ఓ అద్దె కారును తీసుకుని జమీర్ డ్రైవింగ్ చేస్తాడు. మహేష్ ఇంటి బయట కాపలా కాస్తుండగా ఖాజా ఒక్కడే లోపలకు ప్రవేశించి విలువైన ఆభరణాలు అపహరిస్తాడు. అనంతరం అద్దె కారులో ఉడాయించి చోరీ సొత్తును పంచుకునేవారు.

ప్రత్యేక బృందాల నిఘాతో గుట్టురట్టు..

తాళం వేసిన ఇళ్లల్లో చోరీ కేసుల దర్యాప్తును ప్రతిష్టాత్మకంగా తీసుకున్న ఎస్పీ జగదీస్ ఆదేశాల మేరకు అనంతపురం సీసీఎస్ సీఐ ఇస్మాయిల్ ఆధ్వర్యంలో ప్రత్యేక బృందాలు నిఘా పెట్టాయి. ఈ క్రమంలో అందిన పక్కా సమాచారంతో సీఐ ఇస్మాయిల్, అనంతపురం రూరల్ సీఐ శేఖర్ ... ముగ్గురు నిందితులను అనంతపురంలోని కళ్యాణదుర్గం రోడ్డులో ఉన్న రజాక్ ఫంక్షన్ హాలు సమీపంలో అరెస్ట్ చేశారు. నిందితుల నుంచి 310 గ్రాముల బంగారు నగలు, ఓ కారు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసి, రిమాండ్‌కు తరలించారు. నిందితుల అరెస్ట్‌లో చొరవ చూపిన సీఐలు ఇస్మాయిల్, శేఖర్, ఎస్ఐ రాంబాబు, సీసీఎస్ హెడ్ కానిస్టేబుళ్లు శ్రీనివాసులు, మల్లికార్జున, చంద్రశేఖర్, గిరిబాబు, జయకర్, కానిస్టేబుళ్లు శివయ్య, పాండవ, అంజనేయప్రసాద్, రంజిత్, బాలకృష్ణ, షామీర్, రాజశేఖర్‌ను ఎస్పీ అభినందిస్తూ ప్రశంసాపత్రాలను అందజేశారు.